క్లుప్తంగా...

నేడు మాణిక్యమ్మ కాలనీలో ఫలహారం బండ్ల ఊరేగింపు

రాజేంద్రనగర్: బోనాల పండుగను పురస్కరించుకొని రాజేంద్రనగర్‌లో మంగళవారం ఫలహారం బండి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు గౌతమ్‌ముదిరాజ్ వెల్లడించారు. బుద్వేల్ నల్లపోచమ్మ తల్లి, ఈదలమ్మ తల్లి ఫలహారం బండ్ల ఊరేగింపును బుద్వేల్ మాణిక్యమ్మ కాలనీలో వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఈ ఊరేగింపు చేపడుతున్నామన్నారు. మాణిక్యమ్మ కాలనీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



కోకాపేటలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో ఆదివారం నుంచి ప్రారంభమైన బోనాల ఉత్సవాలు సోమవారం కూడా కొనసాగాయి. ఆదివారం పోచమ్మకు బోనాలను నిర్వహించగా, సోమవారం ఎల్లమ్మకు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, కౌన్సిలర్ జి.శివారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఆర్. నర్సింహా, నాయకులు ఆంజనేయులు, హరిశంకర్, రాజుయాదవ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొ.శివకుమార్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్ శివకుమార్ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. ఫుల్‌బ్రైట్ నెహ్రూ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేటర్స్ సెమినార్ అవార్డుకు ఆయన ఎంపిక కావడం విశేషం. ప్రొఫెసర్ శివకుమార్ ఈ ఫెలోషిప్‌తో రెండు వారాల పాటు సెప్టెంబర్‌లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాను సందర్శిస్తారు. యూఎస్ క్యాంపస్‌లలో అలాగే భారతీయ ఉన్నత విద్యపై జ్ఞానాన్ని పంచుకోవడం, ఎంపిక చేసిన క్యాంపస్‌లు, సంస్థల సందర్శనలు, సమావేశాల సమయంలో పరిశోధన సహకారాలు, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి, విదేశాలలో అధ్యయనం తదితర అంశాలను చర్చిస్తారు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు అభినందించారు.

లలిత కళలకు గుర్తింపు అవసరం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ప్రభుత్వం శాస్త్రీయ సంగీత కళలతో పాటు లలిత కళారూపాలకు పెద్దపీట వేస్తోందని ప్రముఖ సాయిటీ వేత్త బ్రహ్మశ్రీ పాములపర్తి వెంకట మనోహర్ రావు అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ గాయకుడు ఈశ్వర్ చంద్రసాగర్ ఆధ్వర్యంలో శాస్త్రీయ కర్ణాటక సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ శాసన సభ్యులు సుభద్రకు సేవారత్న పురస్కారాన్ని అందజేశారు. అనంతరం ఆయన రచించిన భాషా సంగీత సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించారు. సురభి శంకర శర్మ, వరప్రసాద్, విజయ్‌భాస్కర్, ప్రత్యూష పాల్గొన్నారు.

జూలూరు సత్యనారాయణకు ఆదర్శ స్వర్ణ నంది అవార్డు



అవార్డు అందజేస్తున్న దృశ్యం

అబిడ్స్: ఆదర్శ కళానిలయం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఆదర్శ స్వర్ణ నంది అవార్డును ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర టూరిజం విభాగం జూలూరి సత్యనారాయణకు అందజేసి అభినందించారు. 30ఏళ్లుగా సామాజిక సేవలు చేస్తూ నల్లమల్ల అడవుల్లో నివసిస్తున్న జూలూరు సత్యనారాయణ సమాజ సేవలను గుర్తించి ఆదర్శ కళా నిలయం ఈ అవార్డును అందజేసింది. నగరంలో జరిగిన కార్యక్రమంలో జూలూరు సత్యనారాయణకు ఆల్ ఇండియా ఆర్యవైశ్యం నాయకులు డాక్టర్ మొగుల్లపల్లి ఉపేందర్‌గుప్తా, ప్రొఫెసర్ కోదండరాం, పోలీస్ హౌసింగ్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అవార్డులను అందజేసి సత్కరించారు.

చందానగర్, పాపిరెడ్డి కాలనీ రైల్వే అండర్ బ్రిడ్జి పక్కన చెత్త



అండర్ పాస్ ఇలానా..!

వర్షాకాలం చెరువును తలపిస్తున్న అండర్‌బ్రిడ్జి

- చెత్తా చెదారం కలిసి దుర్వాసన
- రోజుల తరబడి రాకపోకలు బంద్
- వాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతం

హఫీజ్‌పేట్: వర్షం కురిస్తే చాలు.. చందానగర్ రైల్వేస్టేషన్ అండర్ పాస్ వర్షపునీటితో నిండిపోతోంది. చందానగర్ హుడాకాలనీ, పాపిరెడ్డి కాలనీల ప్రజ లు పనుల నిమిత్తం చందానగర్ రైల్వేస్టేషన్ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. గతంలో పాపిరెడ్డి కాలనీ నుంచి చందానగర్ హుడా కాలనీకి వెళ్లాలంటే కనీసం 3 కిలోమీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సి వచ్చేది. దీంతో స్థానిక ప్రజల కోరిక మేరకు చందానగర్ రైల్వేస్టేషన్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించారు. అయితే వరదనీరు వెళ్లేలా ప్రణాళిక లేకుండా నిర్మించారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు అండర్ పాస్ వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

- అండర్ పాస్ కింద వరద నీరు నిలవడంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది
- స్థానికులు చెత్త చెదారంను బ్రిడ్జి వద్ద వేయడంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి.దీనికితోడు వర్షపు నీటిలో కలిసి నీటి ప్రవాహంకు అడ్డుపడుతున్నాయి
- చందానగర్, గంగారం, మదీనాగూడవాసులు గచ్చిబౌలి వెళ్లాలంటే ఈ అండర్ పాస్ నుంచే వెళ్లాలి. కానీ వరద నీటి నిల్వతో నెలల తరబడి ఇబ్బందులుపడుతున్నారు.
- హుడా కాలనీ నుంచి బ్రిడ్జికి వచ్చే రోడ్డు పూర్తిగా కంకర తేలి గుంతలు పడ్డాయి.
- సూచిక బోర్డులు లేక అండర్‌పాస్ కింద ప్రమాదాలు జరుగుతున్నాయి.

శాశ్వత పరిష్కారం చూపాలి



చందానగర్, పాపిరెడ్డికాలనీ అండర్ బ్రిడ్జి వర్షాకాలం వరద నీటితో నిండిపోతోంది. చెత్త చెదారం చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా అండర్ పాస్ వరద నీటి సమస్యకు ఉన్నతాధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.

– వీరభద్ర, రాజీవ్‌గృహకల్ప, పాపిరెడ్డికాలనీ

సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి



పాపిరెడ్డికాలనీ అండర్ బ్రిడ్జి వద్ద సూచికబోర్డు లేకపోవడంతో ఎటువైపు ఏ వాహనం వస్తుందో తెలియక ప్రమాదాల బారిన పడుతున్నాం. రాత్రి సమయాలలో విద్యుత్ దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నాం.

– బి.శేఖర్, పాపిరెడ్డి కాలనీ



మలుపు వద్ద సూచిక బోర్డులు లేని దృశ్యం



హుడా కాలనీ నుంచి అండర్ పాస్‌కు వెళ్ళే రోడ్డుపై కంకర తేలిన దృశ్యం

విద్యార్థులకు మంచి వాతావరణం, సౌకర్యాలు అవసరం

మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.ఐనుల్ హసన్



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్న వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయం విద్యార్థులకు అద్భుతమైన సామర్థ్యాలు ఉన్నాయని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. అమెరికాకు చెందిన సపోర్ట్ ఫర్ ఎడ్యుకేషనల్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ (సీడ్) ద్వారా రూ.73.9 లక్షల స్కాలర్‌షిప్‌లను వీసీ మంగళవారం విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వైస్‌చాన్స్‌లర్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి వాతావరణం, తగిన సౌకర్యాలు అవసరమని, తద్వారా వారు తమ సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చ న్నారు. స్కాలర్‌షిప్‌లను అందించే వారి లక్ష్యాన్ని విద్యార్థులు సాధించాలని సూచించారు. ఉర్దూ విశ్వవిద్యాలయం, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ సహకారంతో సీడ్ సంస్థ ఈ ఏడాది 586 మందికి స్కాలర్‌షిప్‌లు ఇచ్చారని తెలిపారు. 'సీడ్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సయ్యద్ మజహరుద్దీన్ హుస్సేని మాట్లాడుతూ విద్యకు మొదటి, ఉపాధికి రెండవ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆత్మవిశ్వాసం, కృషి, చిత్తశుద్ధి, సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా కెరీర్‌ను మెరుగుపర్చుకోవడం, విద్యార్థుల బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ డైరెక్టర్ ముజ్తబాహసన్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం విక్రేతలపై కేసులు నమోదు

హఫీజ్‌పేట్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. బోనాల పండగ సందర్భంగా ప్రభుత్వం మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశించగా ఇదే అదునుగా కొంతమంది పాపిరెడ్డి కాలనీలో ఆది, సోమవారం బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఐదు బెల్ట్ షాపులపై దాడి చేశారు. మద్యం స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పాపిరెడ్డి కాలనీకి చెందిన వెంకటేష్, పార్వతి, అరుణ, బాణావతి ,థారీలపై కేసు నమోదు చేసినట్లు సీఐ పాలవెల్లి పేర్కొన్నారు.

28, 29, 30వ తేదీల్లో జాగృతి తీజ్ పండగ మేళా

సుల్తాన్‌బజార్: మహిళా జాగృతి సంస్థ ఆధ్వర్యంలో అన్నా చెల్లెళ్ల బంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్, వివాహిత రాజస్థానీ మహిళలు ఎక్కువగా జరుపుకునే జాగృతి తీజ్ పండగ మేళాను ఈనెల 28, 29, 30 తేదీల్లో హైదర్‌గూడలోని ఎం.ఎ గార్డెన్‌లో నిర్వహిస్తున్నామని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు సోమవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంస్థ అధ్యక్షురాలు సంగీత భూతాడ, కార్యదర్శి మీనా కాస్లీ వాల్ ఈ మేళాకు సంబంధించి మాట్లాడారు. నిరుపేద మహిళలు తయారు చేసిన జైపూర్ ఆభరణాలు, మృదువైన బొమ్మలు, షోపీస్‌లు, గృహోపకరణలు, రంగు రంగుల రాఖీలు తదితర కళాకృతుల వస్తువులకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నామని వారు తెలిపారు.

పద్మశాలీల అభ్యున్నతికి కృషి



గోల్కొండ: పద్మశాలీల అభ్యున్నతికి అందరి సహకారంతో కృషి చేస్తానన్నాని తెలంగాణ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయనను గుడిమల్కాపూర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యత ద్వారానే పద్మశాలీలు తమ హక్కులను పొందగల్గుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరి శ్రీధర్ సాగర్ తదితరులున్నారు.

అమర్ సింగ్‌కు సన్మానం

గోల్కొండ: అందరి సహకారంతోనే బోనాలు విజయవంతంగా నిర్వహించగలిగామని కార్వాన్‌లోని దర్బార్ మైసమ్మ ఆలయ కమిటీ ట్రస్ట్ కమిటీ చైర్మన్ అమర్ సింగ్ అన్నారు. ఈ సందర్భంగా జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తి పని సంఘం వారు సోమవారం ఆయనను దర్బార్ మైసమ్మ ఆలయ ప్రాంగణంలో సన్మానించారు. బొమ్మల సాయిబాబా చారి, బి. శ్రీకాంత్ చారి తదితరులున్నారు.



ప్రభుత్వాసుపత్రి దుస్థితి ఎమ్మెల్యేకు పట్టదా...?

శంషాబాద్ : ఎమ్మెల్యేగా ఉంటున్న ప్రకాష్‌గౌడ్ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి దుస్థితిని పట్టించుకోరా అంటు బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని సోమవారం బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ తదితరులు పరిశీలించారు. రికార్డుల్లో ఆస్పత్రి ఉన్నతిని పెంచినా వైద్యుల నియామకమే లేదన్నారు. కేవలం ఒకే ఒక వైద్యురాలి ఆధ్వర్యంలోనే ఆస్పత్రిలో సేవలు కొనసాగడం దారుణంగా ఉందన్నారు. పక్కనే ఉన్న మరుగుదొడ్లు అత్యంత దారుణంగా ఉన్నాయని మండిపడ్డారు. యాభై పడకల స్థాయి కల్పిస్తామన్న నేతలు కనీసం పది పడకల స్థాయిలో కూడా ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించలేదన్నారు. జిల్లా డయాగ్నోస్టిక్ కేంద్రం కోసం ఆస్పత్రి ఆవరణలో పనులు ప్రారంభిన తర్వాత దానిని మరో ప్రాంతానికి మళ్లించినా ఎమ్మెల్యేకు ఏ మాత్రం పట్టదా అని ప్రశ్నించారు. అంతర్జాతీయ ఖ్యాతి ఉన్న శంషాబాద్ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఎక్కడ లేనంత దారుణంగా ఉన్న ఎమ్మెల్యేకు గానీ, స్థానిక ప్రజాప్రతినిధులకు గాని పట్టకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమలో యువమోర్చా అదన పు కార్యదర్శి మహేందర్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, అనిల్, రాకేష్, సాయి,గణేష్, జ్ఞానేశ్వర్, అశోక్, సుఖేందర్ పాల్గొన్నారు.



ప్రభుత్వాసుపత్రి ముందు నినాదాలు చేస్తున్న బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ తదితరులు

20న బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభం



బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా కార్యాలయం వద్ద ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: శంషాబాద్‌లో బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభానికి ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 20న రాష్ట్ర పురపాలక శాఖమంత్రి కేటీఆర్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభించిన అనంతరం జిల్లా స్థాయిలో పూర్తిస్థాయి కమిటీని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కె. చంద్రారెడ్డి, కౌన్సిలర్లు భారతమ్మ, మేకల వెంకటేష్ ముదిరాజ్ నాయకులు శ్రీనివాస్, తాజ్‌బాబా తదితరులున్నారు.

మహిళా ఎస్సైకి ఆత్మీయ వీడ్కోలు



ఎస్సై శ్వేతను సన్మానిస్తున్న నాయకులు

అత్తాపూర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా సేవలందించిన బాసాని శ్వేతకు ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ ప్రణవ భక్త సమాజం శ్రీ పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు సన్మాన సభను నిర్వహించారు.

రచయిత సుందర్‌రాజుకు నివాళి



డా.సుందర్ రాజుకు నివాళులర్పిస్తున్న ఆచార్య వెంకటేశ్వరరావు, డీఎస్‌యూ నాయకులు

రాయదుర్గం: ప్రముఖ రచయిత, ఉద్యమకారుడు డాక్టర్ నాగప్పగారి సుందర్రాజు దళిత సాహిత్యానికి విశేష కృషి చేశారని, చిన్నవయస్సులోనే సుందర్రాజు చనిపోవడం తెలుగు సాహిత్యానికి తీరనిలోటని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ తెలుగు విభాగం అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు .నాగప్పగారి సుందర్రాజు వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం హెచ్‌సీయూ దళిత విద్యార్థి సంఘం (డీఎస్‌యూ) ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆచార్య భీమయ్య మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో సుందర్రాజుకు విశేషమైన స్థానం ఉందన్నారు. ఆయన కథలు , సాహిత్యం వివిధ భాషల్లోకి అనువాదమయ్యాయన్నారు. దళిత విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ మాదిగల జీవితాలను ఆవిష్కరించిన రచయిత సుందర్రాజు అని అన్నారు. కార్యక్రమంలో డీఎస్‌యూ కన్వీనర్ కుమార్ రాజ, ప్రతినిధులు వెంకటాద్రి, కమలాకర్, రాణాప్రతాప్, చరణ్, సందీప్, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కుడికుండ సుందరీకరణ పనులు ప్రారంభం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: కుడికుంట చెరువును శోభితవర్ణంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం మసీద్‌బండలో రూ.65 లక్షల అంచనా వ్యయంతో కుడికుంట సుందరీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువుకట్ట పునరుద్ధరణ, మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేక కాలువ నిర్మాణం చేపడతామని చెప్పారు. చుట్టూ ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్ తదితర పనులు చేపడతారన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ నళిని, ఏఈ నాగరాజు, బీఆర్‌ఎస్ నాయకులు రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, చింతకింది రవిందర్ గౌడ్, పద్మారావు, కృష్ణ యాదవ్, మల్లేష్ గౌడ్, కొడిచెర్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్ ఎదుట ఫుట్‌పాత్ క్లోజ్


వాహనదారులకు నరకయాతనే...



తెలంగాణ భవన్ ముందు ఫుట్‌పాత్‌పై అడ్డంగా బారికేడ్లు, కర్రలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 10 నుంచి 12 వైపు వెళ్లే తెలంగాణ భవన్ రోడ్డులో వాహనదారులు ప్రత్యక్ష నరకాన్ని చవి చూస్తున్నారు. తెలంగాణ భవన్ ముందు అడ్డదిడ్డంగా తయారైన పరిస్థితులు వాహనదారులకు నరక యాతనకు గురిచేస్తున్నాయి. అసలే ఈ రోడ్డంతా ఎగుడుదిగుడుతో ఇరుకుగా మారి ప్రస్తుత వాహనాలకు అనుగుణంగా లేకపోగా టీఆర్‌ఎస్ భవన్ ముందే ఫుట్‌పాత్‌లు పాదచారులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. సరిగ్గా భవన్ ముందు ఫుట్‌పాత్‌పై బారికేడ్లు అడ్డుగా పెట్టారు. అంతటితో ఊరుకోకుండా కర్రలు అడ్డుగా తాళ్లతో కట్టారు. దీంతో వరద నీటి కాల్వ ఉన్న ప్రాంతం నుంచి రోడ్డుపైనే పాదచారులు అవతలి వైపు నడవాల్సి వస్తున్నది. ఇక్కడ బారికేడ్లు అడ్డుగా ఎందుకు పెట్టారో పోలీసులకే తెలియాలి. ఇంకోవైపు స్తంభానికి, బారికేడ్లకు కర్రలను ఎందుకు కట్టారో కూడా అర్థంకాని పరిస్థితులు నెలకొన్నాయి. ట్రాఫిక్ పోలీసులు, బంజారాహిల్స్ లా అండ్ ఆర్డర్ పోలీసులు ఈ విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. తెలంగాణ భవన్ ముందు పెరిగిపోతున్న ట్రాఫిక్ నియంత్రణ, ట్రాఫిక్ జామ్‌లపై పోలీసులు చేతులెత్తేశారు. మున్సిపల్ శాఖా మంత్రి నిత్యం వచ్చే తెలంగాణ భవన్ వద్దనే రోడ్డు సరిగ్గా లేకపోవడం.. ఫుట్‌పాత్‌లు అందుబాటులో లేకపోవడం ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నది. వరద వచ్చిందంటే భవన్ ముందు కిలోమీటర్ మేర రోడ్డుకు రెండు వైపులా ట్రాఫిక్ స్తంభించిపోతున్నది. వరద నీరు మోకాళ్లలోతు భవన్ ముందు నిలిచిపోతున్నది. జీహెచ్‌ఎంసీ నిర్వాకం, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసుల నిర్లక్ష్యం ఈ రోడ్డులో వాహనదారులకు శాపంగా మారింది.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిరోజు తాను కార్వాన్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని, అయితే ప్రజలు నేరుగా తనకు తమ సమస్యలను విన్నవించుకోవడానికి ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు.